

స్వామి జంతర్ మంతర్

ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ కొండపి ఎమ్మెల్యే స్వామి తీరుతో ఆ పార్టీ నేతలే తలలు పట్టుకుంటున్నారు. జయహో బీసీ సదస్సు తుస్సుమంది.

- 8లో..



అన్ని వర్గాలకు సంక్షేమం

కుల, మత, వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు.

- 13లో..

గరిష్ఠం/కనిష్ఠం
40/27.7

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. వేడిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నామినేషన్ల స్వీకరణకు సర్వం సిద్ధం

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపిన కలెక్టర్

ఒంగోలు అర్బన్: నామినేషన్ల స్వీకరణకు సంబంధించి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉన్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్‌కుమార్ మీనాకు తెలిపారు. మంగళవారం సీఈవో జిల్లా కలెక్టర్లతో ఎన్నికల నిర్వహణ, నామినేషన్ల స్వీకరణ అంశాలపై వీడియో సమావేశం నిర్వహించారు. దీనిలో సీ-విజిల్ ద్వారా వచ్చిన సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు రూ.1.30 కోట్లకు పైగా అనుమానిత నగదు, ఇతర వస్తువులను సీజ్ చేశామని వివరించారు. కౌంటింగ్‌కు సంబంధించి ఏఆర్‌ఓల ప్రతిపాదనలను కూడా త్వరలో పంపుతామన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి మెటీరియల్ అన్నీ పోలింగ్ కేంద్రాలకు చేరేలా సమగ్రంగా పర్యవేక్షిస్తున్నామని వివరించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, డీఆర్‌ఓ శ్రీలత, ఒంగోలు పార్లమెంటరీ నియోజకవర్గ ఏఆర్‌ఓ జ్యోతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన

- పరిశీలించిన ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ సుమిత్ సునీల్

ఒంగోలు సబర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లను మంగళవారం ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రతా వ్యవస్థ కేంద్ర సాయుధ బలగాలతో పటిష్ట పహారా ఉన్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఒంగోలు పార్లమెంట్, ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ను, కొండపి అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను, అక్కడ ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ సెంటర్లను కూడా పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో 24 గంటల పాటు పహారా కాస్తూ ఉంటారన్నారు. అక్కడ అధికారులకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం పోలీస్ సిబ్బందికి మాబ్ ఆపరేషన్ డ్రిల్, లాఠీ డ్రిల్‌పై ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.



బాబు పాలన సంగతేంటి?

చంద్రబాబు 2014లో గద్దెనెక్కగా ఏడాది వ్యవధిలోనే కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు చెల్లించాల్సిన బిల్లులు రూ.కోట్లలో బకాయి పెట్టి చోద్యం చూశారు. ఆ ఐదేళ్లు ఏజెన్సీ నిర్వాహకులంతా బయట అప్పు చేసి అరకొరగా భోజనం పెట్టిన దుస్థితి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు ప్రాథమిక పాఠశాల్లో ఒక్కొక్కరికి రోజుకు రూ.5.88, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఒక్కొక్కరికి రూ.8.57 చెల్లిస్తోంది. ఇవి పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అయినప్పటికీ చంద్రబాబు జమానాలో ఎంత ఇచ్చారనేది మాత్రం 'ఈనాడు' ఉద్దేశపూర్వకంగా దాచిపెట్టింది.

పథకం అమలులో ఉన్న పాఠశాలలు	2,341
విద్యార్థుల సంఖ్య	1,79,202
మధ్యాహ్న భోజనం తింటున్న వారు	1,42,000(ఈ సంఖ్య రోజూ మారుతుంది)
కుకింగ్ ఏజెన్సీలు	2,341

నిజం మింగుడు పడక..
గుడ్లు తేలేసే అబద్ధాలు

సాక్షి నెట్‌వర్క్

ఐదేళ్ల క్రితం అంటే టీడీపీ జమానాలో ప్రభుత్వ పాఠశాలలు ఎలా ఉన్నాయి.. వాటిలో వంట గదుల తీరుతెన్నులు, కోట్ల రూపాయల బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో పెట్టడంతో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు ఎదుర్కొన్న కష్టాలను ఏనాడూ అచ్చు వేయని 'ఈనాడు'.. సీఎం వైఎస్ జగన్ పాలనలో భావి భారత పౌరులకు 'ముద్ద' కరువైందని అడ్డగోలు రాతలతో శివాలెత్తిపోయింది. క్షేత్ర స్థాయిలో వాస్తవాలను ఏమాత్రం పట్టించుకోకుండా టీడీపీ నాయకులు చేసే విమర్శలను ముడి సరుకుగా మార్చి అబద్ధాల వంట వండి వార్చింది. చంద్రబాబు పాలనలో కంటే మెరుగ్గా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'జగనన్న గోరుముద్ద' మెనూ అమలు చేస్తూ, రోజుకో రకం భోజనం విద్యార్థులకు వడ్డించడం పచ్చ పత్రికకు ఏమాత్రం రుచించలేదని రోత రాతలతో రెచ్చిపోయింది. వేసవిలో ఎండ వేడిమికి గుడ్ల సైజు తగ్గడం సహజం. దాన్ని కూడా భూతద్దంలో చూపుతూ బురదజల్లింది.


మధ్యాహ్న భోజనంపై రోత రాతలు

- టీడీపీ నేతల విమర్శలే ముడిసరుకుగా అబద్ధాల వంట వండి వార్చిన ఎల్లో మీడియా
- ముద్దన్నం, గోలీ గుడ్లు అంటూ తప్పుడు రాతలు
- కాల దోషం పట్టింది చిక్కీలకు కాదు పచ్చ ఇంకు నిండిన కలాలకు..
- బాబు పాలనతో పోలిస్తే అత్యంత మెరుగ్గా 'జగనన్న గోరుముద్ద' మెనూ
- వాస్తవాల వక్రీకరణపై ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రుల మండిపాటు

అవాస్తవాలు రాయడం సరికాదు



గిద్దలూరు పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చాలీ చాలని బియ్యంతో అన్నం వండి పెడుతున్నారని ఈనాడులో వచ్చిన కథనంలో వాస్తవం లేదని పాఠశాల హెచ్‌ఎం ఎం.ప్రేమ్ సాగర్ ఖండించారు. 'సోమవారం 256 మంది హాజరు కాగా అందులో 123 మంది మాత్రమే భోజనం చేశారు. అందుకు సరిపడేలా 16.5 కిలోల బియ్యం ఉపయోగించాం. తినేవారి సంఖ్య ఆధారంగా మధ్యాహ్న భోజనం సిద్ధం చేస్తాం అని హెచ్‌ఎం స్పష్టం చేశారు. నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు మండలంలోని 25 పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు చేశామని, సాంకేతిక లోపాలతో పని చేయని వాటిని సరిచేయిస్తామని ఎంఈఓ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.





ఈనాడులో ప్రచురితమైన కథనం

రోజూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం



పులిపాడు ప్రాథమిక పాఠశాలలో మెనూ ప్రకారం వండిన పులిహోర, దొండకాలయ పచ్చడి, కోడిగుడ్డు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'జగనన్న గోరుముద్ద' పథకాన్ని ప్రవేశ పెట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రోజుకో రకం ఆహారాన్ని అందిస్తోంది. ఎంఈఓలు, పాఠశాలల హెచ్‌ఎంల పర్యవేక్షణలో మెనూ ప్రకారం వారంలో అన్నం, ఆకుకూర పప్పు, పప్పుచారు, కోడి గుడ్డు, పొంగలి, పులిహోర, కిచిడి, బంగాళదుంప కుర్మా, దొండకాయ పచ్చడితోపాటు హాస్టల్ విద్యార్థులకు ఆదివారం చికెన్‌తో భోజనం అందిస్తున్నారు. ఆహారాన్ని మరింత రుచిగా, శుచిగా ఉండేలా చర్యలు తీసుకోవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నా ఈనాడుకు ఏనాడూ కనిపించదు.

'నెల నెలా బిల్లు ఇస్తున్నారయ్యా..'



ఈమె పేరు దాసరి దానమ్మ. ముండ్లమూరు మండలంలోని పులిపాడు ఎస్సీ ప్రాథమిక పాఠశాలలో కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకురాలు. 'ఈ పాఠశాలలోని 32 మంది విద్యార్థులకు మంగళవారం మెనూ ప్రకారం పులిహోర, దొండకాయ చట్నీ, కోడిగుడ్డు వడ్డించారు. విద్యార్థులంతా మధ్యాహ్నం 12 గంటలకు భోజనం తిని ఇంటికి వెళ్లారు. దానమ్మ వంట చేసినందుకు ప్రతి నెలా రూ.4800 వరకు ఖర్చవుతుండగా ఆ మొత్తాన్ని ఆమె బ్యాంకు ఖాతాలో రాష్ట్ర ప్రభుత్వం ఠంచనుగా జమ చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలోనే నెల నెలా బిల్లులు రాక ఇబ్బంది పడ్డామయ్యా. ఓ దశలో పని మానుకుందామనుకున్నా. ఇప్పుడు ఆ బాధ లేదు. నెల తిరిగేసరికి బిల్లు చేతికొస్తోంది' అని 18 ఏళ్లుగా ఇదే పాఠశాలలో విద్యార్థులకు అన్నం వండి పెడుతున్న దానమ్మ చెబుతోంది.

స్కూల్లో భోజనమే కమ్మగా ఉంది



జగనన్న గోరుముద్ద పథకం మెనూ ప్రకారం మా పాఠశాలలో రోజుకో రకం భోజనం వడ్డిస్తున్నారు. మా ఇంట్లో చేసే అన్నం కంటే స్కూల్లో భోజనమే కమ్మగా ఉంది. నేను వెజ్ బిర్యాని రైస్, పులిహోర చాలా ఇష్టంగా తింటున్నా. రోజు మార్చి రోజు రాగి జావ, చిక్కీ, ప్రతి రోజూ కోడి గుడ్డు ఇస్తున్నారు.

– నక్కా హర్షిత, 8వ తరగతి, ఎంపీ యూపీ స్కూల్, ఇడమకల్లు, కొమరోలు మండలం

నాణ్యమైన భోజనం పెడుతున్నారు



మా పాఠశాలలో నాణ్యమైన భోజనం పెడుతున్నారు. మెనూ ప్రకారం రోజూ రుచికరంగా భోజనం పెడుతుండటంతో అందరం చక్కగా తింటున్నాం. నాడు-నేడు కింద మా బడిలో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేశారు. బడి మానేసినోళ్లకు కూడా మా స్కూల్‌ను చూస్తే చదువుకోవాలని కోరిక పుడుతుంది.

– జి.ప్రియాంక, గొట్లగట్టు కేజీబీవీ పాఠశాల

గత ప్రభుత్వంలోనే బిల్లులకు ఇబ్బంది పడ్డాం



నేను పదేళ్లుగా వేముల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిగా పని చేస్తున్నా. మా పాఠశాలలో ఉన్న 192 మంది పిల్లలకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నాం. హెచ్‌ఎంతోపాటు స్థానిక మహిళా సంఘాల నాయకులు రోజూ భోజనాన్ని పరిశీలిస్తారు. పిల్లలందరూ పాఠశాలలోనే భోజనం చేసి ఇంటికి వెళ్తారు. సరుకులకు నెలకు సుమారు రూ.15 వేలు ఖర్చు అవుతోంది. ఆ మొత్తాన్ని తర్వాత నెలలో క్రమం తప్పకుండా ప్రభుత్వం చెల్లిస్తోంది. గత ప్రభుత్వంలోనే సకాలంలో బిల్లులు రాక చాలా ఇబ్బంది పడ్డాం.

– మోతుకూరి మల్లేశ్వరి, వేముల హైస్కూల్ నిర్వాహకురాలు

తప్పుడు రాతలు మంచిది కాదు



పొన్నలూరు ప్రభుత్వ పాఠశాలలో మా పిల్లలకు మధ్యాహ్న భోజనం మంచిగానే అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ ఇలా రుచికరమైన అన్నం పెట్టిన దాఖలాలు లేవు. రాగిజావ, కోడిగుడ్లు, చిక్కీలు అందిస్తున్నా పౌష్టికాహారం అందించడం లేదని తప్పుడు రాతలు రాయడం మంచి పద్ధతి కాదు.

– చుండి వరమ్మ, పొన్నలూరు

చెవిరెడ్డికి లక్ష మెజారిటీ ఖాయం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



సభలో మాటాడుతున్న ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వేదికపై బాలినేని, కేపీ, పోతుల సునీత, దద్దాల, తాటిపర్తి, గంగాడ సుజాత, కాకుమాని, కుప్పం ప్రసాద్, కొమ్మూరి కనకారావు

- ఒంగోలు పార్లమెంట్‌లోని అన్నీ అసెంబ్లీలు గెలుస్తున్నాం
- జనార్దన్ ఎమ్మెల్యే అయితే జనాలను బతకనివ్వడు
- కసి తీర్చుకోవటమంటే నాకు తెలియదు... టీడీపీ వాళ్లు గుర్తు చేస్తున్నారు
- వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి పరిచయ సభలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని
- జిల్లాకు నిధులు కుమ్మరించి అభివృద్ధి చేస్తామన్న చెవిరెడ్డి

ఒంగోలు సబర్బన్:

ఒంగోలు పార్లమెంట్‌లో వైఎస్సార్‌సీపీ విజయ దుందుభి మోగిస్తుందని, పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి లక్ష ఓట్ల మెజారిటీతో విజయం సాధించటం ఖాయమని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి అన్నారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి పరిచయ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. స్థానిక పాత గుంటూరు రోడ్డులోని ఏ-1 ఫంక్షన్ హాలు ఎదురుగా ఉన్న స్థలంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలినేని హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ చెవిరెడ్డికి నాకు 35 సంవత్సరాలుగా సాన్నిహిత్యం ఉందన్నారు. చంద్రబాబు పుట్టిన నియోజకవర్గం చంద్రగిరిలో రెండు సార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయాలని చెవిరెడ్డిని పంపిన సంగతి అందరికీ తెలిసిందేనని పేర్కొన్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సీట్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మీద దాడి చేస్తే భయపడతారని అనుకున్నారు టీడీపీ నేతలు... జగన్ వెనుక ఆయన సైన్యం ఉందన్న సంగతి మాత్రం మరిచిపోవద్దని గుర్తు చేశారు. నా కోడలు సమతా నగర్‌లో ఇంటింటి ప్రచారానికి వెళితే ఏం జరిగిందో తెలుసుగా.. ప్రచారం ఎవరిపాటికి వారు చేసుకుంటూ పోతే ప్రజాస్వామ్య బద్ధంగా ఉంటుందన్నారు. పార్టీ కార్యకర్తల కోసం ఎందాకైనా పోరాడతానని బాలినేని కేడర్‌కు భరోసా ఇచ్చారు. ఒకాయన ఎర్రబుక్కు అంటున్నాడు, ఒంగోలు ఆయన తెల్లబుక్కు అంటున్నాడని మండి పడ్డారు. వాళ్ల పుస్తకాల్లో రాసుకోవాలేమో నాకు ఆ అవసరం లేదు.. అన్నీ గుర్తుంటాయన్నారు. కక్ష సాధింపు అంటే తనకు తెలియదని, టీడీపీ వాళ్లు గుర్తు చేస్తున్నారన్నారు. దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యే అయితే జనాలను బతకనివ్వడని చెప్పారు.

నిధుల వరద కురిపించి అభివృద్ధి చేస్తా..

వైఎస్సార్ సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి మాట్లాడుతూ వాసన్నతో మాది విడదీయరాని బంధమన్నారు. గతంలో ఒంగోలు అంటే అశాంతి, మర్డర్లు ఉండేవన్నారు. వాసన్న ఎమ్మెల్యేగా, మంత్రిగా చేస్తున్నప్పటి నుంచి ప్రస్తుతం ప్రశాంతంగా ఒంగోలు ఉందంటే ఒక నాయకుని ముందు చూపన్నారు. ఇక్కడ టీడీపీ అభ్యర్థిగా ఉన్న వ్యక్తి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నాడని ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబ సభ్యుడు వాసన్న అని, తాను 36 సంవత్సరాలుగా వైఎస్ కుటుంబంతోనే కలిసిమెలిసి ఉన్నానన్నారు. ఇంత వరకూ వైఎస్ కుటుంబం ఎటు ఉంటే అటే తాను ఉంటానని వివరించారు. పెద్దాయన వైఎస్ రాజారెడ్డి తన చిన్నతనంలోనే చేరదీశాడని, ఆ తరువాత దివంగత మహానేత వైఎస్సార్ తన ఎదుగుదలకు పాత్రుడయ్యాడన్నారు. ఆ తరువాత సీఎం వైఎస్ జగన్ అదే స్థాయిలో తనను చూసుకుంటున్నారని గుర్తు చేశారు. ఒంగోలు నగరంలోని ఇళ్లు లేని నిరుపేదల కోసం వాసన్న పడిన తపన తనకు తెలుసన్నారు. పార్లమెంట్ పరిధిలో తనతో పాటు ఏడుగురు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి, రాష్ట్రం నుంచి, కేంద్రం నుంచి నిధుల వరద కురిపించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోతామన్నారు. కార్యక్రమంలో తొలుత పార్టీ నగర అధ్యక్షుడు కఠారి శంకర్ పార్టీ నేతలను వేదిక మీదకు ఆహ్వానించారు. సదస్సులో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి పరిచయ కార్యక్రమం మాదిరిగా లేదని ఇది విజయోత్సవ సభను తలపిస్తోందన్నారు. సదస్సులో మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి, కొండపి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్సీ పోతుల సునీత, కనిగిరి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్, మార్కాపురం అభ్యర్థి ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరు అభ్యర్థి ఎమ్మెల్యే కేపీ.నాగార్జున రెడ్డి, దర్శి అభ్యర్థి బూచేపల్లి శివ ప్రసాద రెడ్డి, యర్రగొండపాలెం అభ్యర్థి తాటిపర్తి చంద్ర శేఖర్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు కుప్పం ప్రసాదు, కాకుమాను రాజశేఖర్, కొమ్మూరి కనకారావు మాదిగతో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సభకు వేలాదిగా హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం

- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన



పన్నూరులో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిమూలపు సురేష్

మర్రిపూడి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని కెల్లంపల్లి పంచాయతీ అగ్రహారం, పిన్నికవారిపాలెం, పన్నూరు గ్రామాల్లో 'పల్లెపల్లెకు సురేష్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన లభించింది. తమ పవిత్రమైన ఓటు ఫ్యాన్ గుర్తుకు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కొండపి నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామన్నారు. పేదల ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. చంద్రబాబునాయుడు అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఓటర్లు బాబును నమ్మే పరిస్థితి లేదని, వైఎస్సార్ సీపీని విమర్శించే అర్హత బాబుకు లేదన్నారు. ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ అజెండా అని చెప్పారు. ప్రతి పేదవానికి జగన్ ప్రభుత్వంలోనే లబ్ధిచేకూరిందని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. ఓటమి భయంతో చంద్రబాబు నాయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పై రాళ్ల దాడి చేయించారన్నారని మండిపడ్డారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా వైఎస్సార్ సీపీ గెలుపును ఎవరూ ఆపలేరన్నారు. ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డిని, కొండపి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పార్టీ అధ్యక్షుడు దొడ్డాలి మల్లికార్జునరావు, మాకినేని వెంకట్రావు, బోగసముద్రం విజయ భాస్కర్‌రెడ్డి, బోద రమణారెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, మాచేపల్లి నాగయ్య, బీవీ భాస్కర్‌రెడ్డి, పీ సంజీవరెడ్డి, ఎం శివరామిరెడ్డి, ఆర్ కొండయ్య, ఎస్ వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్రీనివాసులు, రామయ్య, సుబ్బారావు, వీ మల్లికార్జురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, కే ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

6 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

మండలంలోని రావిళ్లవారిపాలెం గ్రామానికి చెందిన 6 కుటుంబాలు వైఎస్సార్ సీపీ నాయకుడు బొల్లినేని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం పార్టీలో చేరాయి. జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలోకి వచ్చామని వారు తెలిపారు. పార్టీలోకి వచ్చిన వారికి మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.



వైఎస్సార్ సీపీలో చేరిన రావిళ్లవారిపాలెం గ్రామస్తులతో మంత్రి సురేష్

క్లుప్తంగా

ఎన్నికల మీడియా సెల్ ప్రారంభం


మీడియా సెల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు మీడియా ద్వారా తెలియచేసేలా కలెక్టరేట్ రికార్డు భవనంలో ఏర్పాటు చేసిన ఎన్నికల మీడియా సెల్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత నెల 16వ తేది ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లలో చైతన్యం తీసుకు వచ్చి పోలింగ్ శాతం పెంచేలా కృషి చేస్తున్నామన్నారు. ఎంసీఎంసీ కమిటీ మీడియాలో రాజకీయ ప్రకటనలకు అనుమతులు ఇవ్వడంతో పాటు పెయిడ్ వార్తలను పర్యవేక్షిస్తామన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఝాన్సీ, డీఐపీఆర్‌ఓ గ్రేస్ లినోరా, డీపీఆర్‌ఓ రమేష్, డివిజనల్ పీఆర్‌ఓ దుర్గాప్రసాద్, ఎంసీఎంసీ సభ్యులు కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని యువకుడు మృతి

కొత్తపట్నం: ఎలుకల మందు తిని యువకుడు మృతిచెందిన సంఘటన కొత్తపట్నం మండలం రంగాయపాలెం పంచాయతీ క్రాంతినగర్‌లో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుడైన విశ్వనాథపల్లి కల్యాణ్ (39) చేపల వేటతో జీవనం సాగిస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా అప్పులు చేసి తీర్చలేకపోయాడు. ఆ బాధతో మంగళవారం ఎలుకల మందు తిని స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న బంధువులు ఒంగోలు జీజీహెచ్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. హాస్పిటల్ నుంచి అందిన సమాచారం ప్రకారం ఎస్సై బి.సాంబశివరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సేవకుడినవుతా.. సేవలందిస్తా...


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు


చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల నాయకులు

- కేంద్రం నుంచి నిధులు తెస్తా.. గ్రామాలను అభివృద్ధి చేస్తా
- నా పదవిని సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకోను
- పూర్తిగా ప్రజా సంక్షేమం కోసమే పాటుపడతా..
- వైఎస్సార్ కుటుంబంతో కలిసి 36 ఏళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్నా..
- మంచి చేసేందుకు అవకాశం ఇవ్వండి
- పరిచయ కార్యక్రమంలో ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి

కొత్తపట్నం: ప్రజలందరికీ సేవకుడిగా మారి సేవలందిస్తానని, మంచి చేసేందుకు తనను ఎంపీగా గెలిపించి అవకాశం ఇవ్వాలని వైఎస్సార్ సీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కరరెడ్డి వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలతో చెవిరెడ్డి పరిచయ కార్యక్రమాన్ని మంగళవారం అట్టహాసంగా నిర్వహించారు. కొత్తపట్నంలోని ఒంగోలు రోడ్డులో పెట్రోలు బంక్ పక్కన నిర్వహించిన ఈ కార్యక్రమానికి చెవిరెడ్డితో పాటు ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ కొత్తపట్నం మండల అధ్యక్షుడు చెరుకూరి వీరరాఘవరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి మాట్లాడుతూ తనను ఎంపీగా గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. వైఎస్ రాజారెడ్డితో తన చిన్న వయసు నుంచే పరిచయం ఉందని, ఆ తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డితో కొన్ని సంవత్సరాలు పనిచేశానని తెలిపారు. ఆయన మరణించిన తర్వాత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో పనిచేస్తున్నానన్నారు. వైఎస్ కుటుంబంతో బంధుత్వంతో పాటు 36 ఏళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్నానని వివరించారు. ఆ నమ్మకమే ప్రస్తుతం ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పోటీచేసేందుకు కారణమైందన్నారు. తనకు సొంత వ్యాపారాలు లేవని, పదవిని సొంత పనులకు ఉపయోగించుకునే వాడిని కాదని, ఎప్పుడూ జనం మధ్యలో ఉంటూ సేవలందిస్తానని చెవిరెడ్డి తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు రావాల్సిన నిధులను కేంద్ర నుంచి తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పూర్తి సమయం ప్రజాసేవకే కేటాయిస్తానని చెప్పారు.

టీడీపీ అరాచకాలను తిప్పికొట్టాలి...

టీడీపీ ప్రభుత్వం అరాచకాలు సృష్టిస్తోందని, వాటిని తిప్పికొట్టాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు చెవిరెడ్డి భాస్కరరెడ్డి పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనే టీడీపీ వారు దాడికి తెగబడితే.. ఇక, గ్రామాల్లో సామాన్య మానవుడి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థంచేసుకోవాలన్నారు. వలంటీర్లను చంద్రబాబు అసభ్యంగా చిత్రీకరించడం ఎంతో బాధగా ఉందన్నారు. మళ్లీ తాజాగా వలంటీర్లకు పది వేలు ఇస్తామని, ఏడాదికి లక్ష ఇస్తామని చెప్పడం ఆయన మోసపు మాటలకు నిదర్శనమని అన్నారు. చంద్రబాబు మాటలు నమ్మవద్దని, ప్రజలంతా ఓటుతో టీడీపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చేసిన అభివృద్ధి పనులు చాలా ఉన్నాయన్నారు. తప్పుచేసిన వ్యక్తిని కూడా క్షమించి మళ్లీ దగ్గరకు తీసుకునే గొప్ప వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి బాలినేని అని కొనియాడారు. అంతటి మంచి వ్యక్తిని మంచి మెజార్టీతో గెలిపించుకుని మరోసారి మంత్రిగా చూడాలని ప్రజలను చెవిరెడ్డి కోరారు. నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో సైతం మొండి పట్టుదలతో వ్యవహరించి ఒంగోలులో 25 వేల మందికి ఇళ్ల స్థల పట్టాలను బాలినేని పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మంచి మనసుతో అందరి మేలు కోరే వ్యక్తి బాలినేని శ్రీనివాసరెడ్డి అని చెవిరెడ్డి వివరించారు.

భారీ మెజార్టీతో చెవిరెడ్డి గెలుస్తారు : బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చంద్రగిరిలో రెండుసార్లు ఎమ్మెల్యేగా మెరుగైన సేవలు అందించారని తెలిపారు. ఒంగోలు ఎంపీ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కలిపి లక్ష ఓట్ల మెజార్టీతో చెవిరెడ్డి గెలవబోతున్నారని అన్నారు. టీడీపీ అరాచకాలు చూస్తుంటే ఎంతో బాధగా ఉందన్నారు. సీఎంపైనే రాళ్లు వేయడం, వలంటీర్లపై నిందలు వేసి కొట్టడం చూస్తున్నామన్నారు. తన కోడలు శ్రీకావ్య ఒంగోలు సమతానగర్‌లో ఎన్నికల ప్రచారానికి వెళ్తే అడ్డుకుని వలంటీర్‌పై దాడి చేయడం ఎంతో బాధగా ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఓటు అడిగే హక్కు ఉందని చెప్పారు. కానీ, తన కుటుంబ సభ్యులపై ఇష్టమొచ్చినట్లు ఆరోపణలు చేయడం ప్రజలు చూస్తున్నారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో ప్రజలే టీడీపీకి గుణపాఠం చెప్పాలన్నారు. 2019 ఎన్నికల్లోనూ ఒంగోలు కమ్మపాలెంలోకి తనను వెళ్లనీయకుండా టీడీపీ నాయకులు అడ్డుకున్నారని, అందుకు ప్రజలే ఓట్లతో బుద్ధి చెప్పారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో ఏ ఒక్క కార్యకర్తపై చేయిచేసుకున్నా ఒప్పుకునేది లేదని బాలినేని హెచ్చరించారు. కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ మండలంలో 42 వేల ఓట్లు ఉన్నాయని, 53 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఓటర్లందరితో వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయించి మండలంలో 10 వేల మెజార్టీ తీసుకురావాలని కోరారు. అనంతరం చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డిని గజమాలతో నాయకులు సత్కరించారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ పరిశీలకుడు మాదాసి వెంకయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సైకం లక్ష్మీశారద, రాష్ట్ర మత్స్యకార వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వాయల సుమతి, మండల సచివాలయాల కన్వీనర్, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ దాచూరి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శెట్టి కోటేశ్వరమ్మ, మాజీ ఎంపీపీలు వాయల మోహన్ రావు, బలగాని శ్రీనివాసరావు, గొర్రెపాటి శ్రీను, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ యూత్ అధ్యక్షుడు ములకా రామిరెడ్డి, పురిణి ప్రభావతి, వీఆర్‌సీ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ బాజీ, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ పాత్ర కీలకం

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దినేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పోలింగ్ ప్రక్రియలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమైందని, పోలింగ్ తీరును గుర్తించడంలో వారు ఇచ్చే నివేదిక ఎంతో ముఖ్యమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్పందన హాలులో 410 మంది మైక్రో అబ్జర్వర్‌లకు మంగళవారం మొదటి విడత శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ నిబంధనల మేరకు జరిగేలా పర్యవేక్షించడంలో మైక్రో అబ్జర్వర్‌లది కీలక పాత్ర అన్నారు. పోలింగ్ కేంద్రంలో సిబ్బంది ఎన్నికల నియమావళి పాటిస్తున్నారో లేదో చూడాల్సిన బాధ్యత వీరిపై ఉందన్నారు. ఎటువంటి ఘర్షణలు జరగకుండా, రీ పోలింగ్ పరిస్థితులు తలెత్తకుండా స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా వివిధ హోదాల్లో పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాకు ఎన్నికల అబ్జర్వర్‌లు వచ్చిన అనంతరం వారి సమక్షంలో మైక్రో అబ్జర్వర్‌లకు మరోసారి శిక్షణ ఇస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ, ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను, వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసిన విధానం, మాక్ పోలింగ్ నిర్వహణ, ఈవీఎంల అనుసంధానం తదితర అంశాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎన్నికల సంఘం ఇచ్చిన చెక్‌లిస్ట్‌ను మైక్రో అబ్జర్వర్‌లు నిర్లక్ష్యం లేకుండా అనుసరించాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం అబ్దుల్ రహీం ఇతర అధికారులు పాల్గొన్నారు.


హాజరైన మైక్రో అబ్జర్వర్లు

స్వామి జంతర్ మంతర్

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొండపి ఎమ్మెల్యే తీరుతో ఆ పార్టీలోని సీనియర్ నేతలు సైతం తలలు పట్టుకునే పరిస్థితి నెలకొంది. పదేళ్లు ఎమ్మెల్యేగా ఇది చేశా అని చెప్పుకోవడానికి ఒక్కటి కూడా స్వామికి లేదు. దీంతో ఈ విడత ఎన్నికల్లో ఘోర ఓటమి తప్పదని భావించి జంతర్ మంతర్ రాజకీయాలకు తెరదీశాడు. పార్టీ క్యాడర్ చేజారకుండా ఉండేందుకే నిత్యం పార్టీలో చేరికలంటూ టీడీపీ వారికే కండువాలు కప్పి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇక టీడీపీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన జయహో బీసీ సదస్సుకు వందల సంఖ్యలో కూడా హాజరు కాలేదంటే నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.


జనం లేక వెలవెలబోతున్న పాకల జయహో బీసీ సదస్సు


పాకలలో టీడీపీ వారికే కండువాలు కప్పి పార్టీలో చేరికలంటూ ప్రచారం

- టీడీపీ వాళ్లకే కండువాలు కప్పి పార్టీలో చేరికలంటూ నిత్యం హడావిడి
- ఎమ్మెల్యే స్వామి తీరుతో పార్టీ శ్రేణులే విస్మయం
- జయహో బీసీ సదస్సు అట్టర్ ఫ్లాప్
- జనం లేక వెలవెలబోయిన సదస్సు
- మిగిలిపోయిన వంటకాలు సముద్రం పాలు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కొండపి నియోజకవర్గంలో టీడీపీ పరిస్థితి రోజు రోజుకు దిగజారుతోంది. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య అసత్య ప్రచారం చేస్తూ పార్టీ నేతల వద్దే అభాసుపాలవుతున్నారు. సోమవారం పాకలలో ఎమ్మెల్యే స్వామి సమక్షంలో టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి బంధువు పాకల నివాసి గోళ్లమూడి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరినట్లు ప్రచారం చేసుకున్నారు. కానీ వారంతా టీడీపీ వారే. గోళ్లమూడి శ్రీనివాసులరెడ్డితో కలిసి కోడిపందేలు ఆడే బృందంలోని సభ్యులేనని గ్రామస్తులే ఆరోపిస్తున్నారు. కానీ టీడీపీ వారు మాత్రం గొప్పగా కొత్తగా పార్టీలో చేరికలు జరిగాయని ఊదరగొట్టుకోగా..పచ్చ పత్రికలు బాకా ఊది అభాసుపాలయ్యాయి. ఇటీవల 15 రోజుల కలికవాయ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 50 కుటుంబాలు ఐటీసీ దగ్గర ఉన్న దామచర్ల సత్య పొగాకు గోడౌన్‌లో పార్టీలో చేరారు. వాస్తవానికి వీరు ఆది నుంచి టీడీపీ సానుభూతిపరులే. వీరిలో ఒకరు టీడీపీ మద్దతుతో గెలిచిన 7వ వార్డు మెంబర్ మిడసల మల్లీశ్వరి భర్త గోవర్దన్ కాగా, మరొకరు కలికవాయ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లుతో పాటు టీడీపీ సానుభూతిపరులు ఉన్నారు. అంతేకాక జరుగుమల్లి మండలం సాదువారిపాలెంలో టీడీపీకి చెందిన ఏల్చూరి రామాంజనేయులు, శ్రీనివాసులు, వెంకట శేషయ్య, కొర్లపాటి బాలరాజుతో పాటు మొత్తం 15 కుటుంబాల వారు పార్టీలో చేరినట్లు ప్రకటించారు. వీరు కూడా టీడీపీ సానుభూతిపరులే.


దామచర్ల సత్య ఆధ్వర్యంలో చేరిన వీరంతా టీడీపీ సానుభూతిపరులే

జయహో బీసీ సదస్సు అట్టర్ ఫ్లాప్

సింగరాయకొండ మండలం పాకల బీచ్‌లో సోమవారం నిర్వహించిన జయహో బీసీ సదస్సు అట్టర్‌ఫ్లాప్ అయింది. సదస్సుకు 6 వేల మంది హాజరవుతారని వారంరోజుల పాటు భారీ ప్రచారం చేశారు. ఆ మేరకు ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గాలైన యాదవులు, మత్స్యకారులు, వడ్డెరలు, ముస్లిం మైనారిటీలు, రజక, నాయీబ్రాహ్మణులు సుమారు 60 వేల మంది వరకు ఉన్నారు. వీరిలో 10 శాతం రాకపోతారా అని భావించారు. కానీ సదస్సుకు వందల్లో మాత్రమే హాజరు కావడంతో పార్టీలోని సీనియర్ నేతలు ఇదేం ఖర్మ అంటూ విస్మయం వ్యక్తం చేశారు. సదస్సు సక్సెస్ కాకపోవటంతో వండిన వంటకాలు పెద్ద సంఖ్యలో మిలిగిపోవడంతో వాటిని ట్రాక్టర్లలో తీసుకువెళ్లి సముద్రం పాలు చేశారని మత్స్యకారులు చెబుతున్నారు. సదస్సుకు టీడీపీ ఒంగోలు ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఆయన కుమారుడు రాఘవరెడ్డి గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. పదేళ్లు ఎమ్మెల్యేగా ప్రజలకు స్వామి చేసిందేమీ లేకపోవడంతో ప్రజల్లో ఆయనపై నమ్మకం పూర్తిగా సన్నగిల్లిందని టీడీపీలోని సీనియర్ నేతలు బాహాటంగా విమర్శించే పరిస్థితి నెలకొంది.

పొత్తు.. చిత్తు..!

- బీఎన్ విజయకుమార్ ప్రచారంలో బీజేపీ నాయకులకు అవమానం
- జనసేన నాయకులను ప్రచార రథంపైకి ఆహ్వానించి బీజేపీ నాయకుడు వరప్రసాద్‌ను పిలవని వైనం


బీఎన్ విజయ్‌కుమార్ మాట్లాడుతుండగా వాహనం వద్ద నిలబడి ఉన్న బీజేపీ నేత వరప్రసాద్

నాగులుప్పలపాడు: టీడీపీ కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య అడుగడుగునా విభేదాలు తలెత్తుతూనే ఉన్నాయి. ఆయా పార్టీల అధినేతలు పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ పార్టీల నాయకుల మధ్య పొంతన కుదరడం లేదు. నాయకుల మధ్య సమన్వయం లేకపోగా, విభేదాలు, అవమానాలతో పొత్తును చిత్తు చేస్తున్నారు. కొసరు కోరుకుంటే.. అసలుకే మోసం అన్న చందంగా సంతనూతలపాడు నియోజకవర్గంలో టీడీపీ కూటమి పరిస్థితి నెలకొంది. నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్ ప్రచారంలో జరిగిన సంఘటనే అందుకు నిదర్శనంగా ఉంది. బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ప్రచార రథంపైకి జనసైనికులను ఆహ్వానించిన బీఎన్ విజయకుమార్.. తన వాహనం ఎదురుగా నిలబడి ఉన్న బీజేపీ రాష్ట్ర నాయకుడు పొద వరప్రసాద్‌ను మాటమాత్రం కూడా వాహనంపైకి ఆహ్వానించలేదు. ఎదురుగా నిలబడి కనిపిస్తున్నా.. పలకరించినాగానీ, బీఎస్ విజయకుమార్ పట్టించుకోకుండా అవమానించడంపై బీజేపీ నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు తీరు మాదిరిగా కుట్రపూరితంగానే ఆ పార్టీ అభ్యర్థులు కూడా కొన్నిచోట్ల జనసేన నాయకులను, మరికొన్ని చోట్ల బీజేపీ నాయకులను పూర్తిగా పక్కన పెట్టి ఆయా పార్టీల పేర్లు, నాయకుల పేర్లు కూడా ప్రసంగాల్లో లేకుండా జాగ్రత్తపడుతూ అవమానించడంపై వారి మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు తలెత్తుతున్నాయి. ఈ ప్రభావంతో చివరకు పొత్తు పార్టీలన్నీ చిత్తయ్యే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

టీడీపీ ప్రచారంలో అపశ్రుతి...

ఉప్పుగుండూరు గ్రామంలో మంగళవారం రాత్రి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బీఎస్ విజయకుమార్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బాణసంచా కాలుస్తుండగా, ఒకటి కిందనే పేలి జగన్నాథం కోటేశ్వరి అనే మహిళ తలకు తీవ్రగాయమైంది. ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు.

18 నుంచి రఘునాయకస్వామి కళ్యాణ వేడుకలు

నాగులుప్పలపాడు: ప్రముఖ పుణ్యక్షేత్రం చదలవాడలో శ్రీ రఘునాయస్వామి కళ్యాణ వేడుకలను ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అనిల్ తెలిపారు. 18వ తేదీ స్వామివారికి అంకురార్పణ కార్యక్రమంతో మొదలై 25న స్వామివారికి కళ్యాణం తలంబ్రాల అనంతరం సాయంత్రం రథోత్సవం జరుగుతుందని వివరించారు. కళ్యాణ ఘట్టానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

మా మొదటి ఓటు జగనన్నకే


వెల్లంపల్లి ఎస్సీ కాలనీలో యువకులను ఆహ్వానిస్తున్న మంత్రి మేరుగు, ఎంపీ నందిగం సురేష్

మద్దిపాడు: మా మొదటి ఓటు జగనన్నకే వేస్తామని వెల్లంపల్లి గ్రామ యువకులు తెలిపారు. మండలంలోని వెల్లంపల్లి గ్రామంలో టీడీపీ కుటుంబ నేపథ్యంలో ఉన్న పలువురు యువకులు తమ తల్లిదండ్రులతో మాట్లాడి కుటుంబాలు మొత్తం వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఓట్లు వేసేందుకు నిర్ణయం తీసుకొని మంత్రి మేరుగు నాగార్జున, ఎంపీ నందిగం సురేష్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి మేరుగ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విధానాలు తమకు ఎంతో నచ్చాయని, అందుకే మరోమారు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకునేందుకు తమ మొదటి ఓటును ఆయనకే వేయాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పార్టీ చేరిన వారిలో చల్లపల్లి కృష్ణవేణి, రాయపాటి రజని, ప్రతిమ, గోపి, వెంకటరమణ, రంగవల్లి, నాగమణి, మల్లికార్జున, ఆంజనేయులు, అన్వేష్, సాయిరామ్, అశోక్, జయ చంద్ర, మణి, కార్తిక్, చరణ్, చంద్రశేఖర్, శ్రీకాంత్, చిట్టిబాబు వెంకటేశ్వర్లు సుధాకర్ నాగరాజు, రమేష్, శ్రీనివాసులు, కె.వెంకటేశ్వర్లు, రత్నం నిత్యానంద్ ప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో వారి వెంట మండల పార్టీ ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, గుడ్డపాతల రవి, మండవ బాల చంద్రమౌళి, శ్రీకాంత్ ఇతర నాయకులు ఉన్నారు.

జనసేన నుంచి భారీగా వైఎస్సార్ సీపీలోకి


వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి, బాలినేని శ్రీనివాసరెడ్డి

- ఆరు డివిజన్ల నుంచి దాదాపు 180 కుటుంబాలకు పైగా
- కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని జనసేన పార్టీ నుంచి భారీ స్థాయిలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ మేరకు స్థానిక వీఐపీ రోడ్డులోని బాలినేని నివాసంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరేందుకు వచ్చిన వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఒంగోలు నగరంలోని 37వ డివిజన్‌కు చెందిన జనసేన నాయకుడు బండారు సురేష్, ఇతర నాయకులు ఊతకోలు దుర్గా, నరశింహం శెట్టి విజయ్‌ల ఆధ్వర్యంలో దాదాపు 180 కుటుంబాలకు పైగా వైఎస్సార్‌సీపీలో చేరారు. వీళ్లందరికీ బాలినేని పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. 38, 37, 24, 16, 03, 01 డివిజన్ల నుంచి జనసేన పార్టీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, సీఎం వైఎస్ జగన్ ఆశయాలు నచ్చి పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం ఇస్తామన్నారు. అందరినీ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి, పార్టీ నాయకులు ఘంటా, గోలి తిరుపతి రావు, బాలిశెట్టి నాగేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.